

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

ఈనెల 24న సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'మీ కోసం- ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు నిర్వహించనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇకపై ప్రతి సోమవారం సదరు మీకోసం – ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు.

పిఎస్ 4 హోటల్‌ను మూసివేయాలి

- యాజమాన్యంపై కేసు నమోదు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నేతల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుమలకు వచ్చే భక్తులు, స్థానిక ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న పిఎస్ 4 హోటల్ యాజమాన్యంపై కేసు నమోదుచేసి, ఆ హోటల్‌ను మూసివేయాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టిటిడి మాజీ బోర్డు సభ్యులు ఓవి.రమణ, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు పి.అంజయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివకుమార్, తిరుపతి స్థానిక హక్కుల పోరాట కమిటీ నాయకులు డిఎంసి భాస్కర్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాత్రాస్థలం తిరుపతిలోని పిఎస్4 హోటల్‌కు వచ్చిన కస్టమర్లు తింటున్న భోజనంలో విషపూరితమైన జెర్రి ఉండటాన్ని చూసి అడిగినందుకు కస్టమర్లపై హోటల్ సిబ్బంది దాడిచేయడం సిగ్గు చేట్లు అన్నారు. కుళ్లిన కూరగాయలు, కాలం చెల్లిన పదార్థాలతో ఆహారాన్ని తయారుచేసి హోటల్‌కు వచ్చే కస్టమర్లకు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. అంతేకాకుండా ఎక్కువభాగం హోటల్స్‌లో తాగునీరు శుభ్రంగా ఉండటం లేదని అన్నారు. ఫుడ్ ఇన్స్పెక్టర్లు, హెల్త్ అధికారులు తిరుపతి నగరంలోని అన్ని హోటల్స్‌లో తనిఖీ చేసి నాణ్యతాప్రమాణాలు పాటించేలా తగుచర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్ యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోకుంటే వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎం. మాధవ్, ఎస్.జయచంద్ర, కె.వేణుగోపాల్, పి.చిన్న, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఆర్.మల్లికార్జునరావు, పి.మునిరాజా పాల్గొన్నారు.



ఇదేందయ్యా.. ఇది..
భోజనంలో జెర్రి..

- హోటల్స్, రెస్టారెంట్స్‌లో కుళ్లిన కూరగాయలు
- ఆహారంలో జెర్రులు, బొద్దికంలు, బల్లులు
- తూతూ మంత్రంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు
- లాభార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

తిరుమల, తిరుపతి యాత్రాస్థలం కావడంతో రోజూ వేలాది మంది భక్తులు, యాత్రికులు వస్తుంటారు. వారు నాణ్యమైన మంచి భోజనం చేద్దాం అనుకుంటే కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులున్న వంకాయలు, కాలం చెల్లిన మసాల, బొద్దింకలు, జెర్రిలు, బల్లులు పడి ఆహారాన్ని అందించి వారి ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నారు హోటల్స్ యజమానులు.

తిరుపతి నగరంలో శుభ్రమైన, నాణ్యమైన ఆహారం దొరక్క కల్తీ ఆహారం తింటూ నిత్యం యాత్రికులు ఆసుపత్రి పాలవుతున్నారు. విహారానికో.. దేవున్ని చూడటానికో వచ్చే వారు ఇక్కడి తిండి తిని ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. దీనికి కారణం మున్సిపల్ ఆరోగ్యశాఖతోపాటు ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు లేకపోవడం. ఫుడ్ ఇన్స్పెక్టర్ ప్రతిరోజు అనుమానం కలిగిన హోటల్ రెస్టారెంట్లపై తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ తిరుపతిలో అలా జరగడం లేదు. కొన్ని హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. ముఖ్యంగా మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి రెగ్యులర్ అధికారి లేకపోవడం ఈసమస్యకు ఓ కారణమని చెప్పవచ్చు. ఉన్నవారు డిప్యూటేషన్ మీదుగా వైద్య ఆరోగ్యశాఖ నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. రెండు సంవత్సరాల తర్వాత ఆరోగ్యశాఖ అధికారి మాతృశాఖకు వెళ్లి పోవాల్సి ఉంటుంది.

జిల్లాలో ఫుడ్ ఇన్స్పెక్టర్ ఒక్కరే ఉంటారు. జిల్లా మొత్తం హోటల్లో పాస్ఫోర్ట్ సెంటర్లు తనిఖీలు చేయాలంటే సిబ్బంది లేక అరకొర తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు ఫుడ్ ఇన్స్పెక్టర్. గత 20 సంవత్సరాల క్రితం మున్సిపాలిటీలో రెగ్యులర్ ఆరోగ్య అధికారి ఉండేవారు.. కానీ ఇప్పుడు డిప్యూటేషన్ మీద రావడం వల్ల హోటల్స్, పాస్ట్‌ఫుడ్ సెంటర్లులో తనిఖీ చేసే అధికారం ఉండడం లేదు. హోటల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై ఫిర్యాదులు వస్తే తప్ప తనిఖీలు చేసే అధికారం వారికి లేదు.. కేవలం మున్సిపల్ కార్పొరేషన్ ఇన్స్పెక్టర్లకు మాత్రేమ తనిఖీ చేసే అధికారం ఉంది. దీనికి తోడు తిరుపతిలో హోటల్స్, పాస్ట్‌ఫుడ్ సెంటర్లు తనిఖీ చేయాలంటే ప్రజాప్రతినిధుల అనుమతి లేనిదే తనిఖీలు చేసే ధైర్యం వారికి లేదనే చెప్పాలి..

తిరుమల బైపాస్‌రోడ్డులోని పిఎస్4 హోటల్‌కు నాలుగు రోజుల క్రితం భోజనం చేసేందుకు వచ్చిన ఓ యువకుడికి చేదు అనుభవం ఎదురైంది. హోటల్ సిబ్బంది వడ్డించిన భోజనంలో ఓవింత ఆకారం కనిపించింది. నిశితంగా పరిశీలించగా బాగా రోస్ట్ అయిన జెర్రిగా గుర్తించాడు. దీంతో ఇదేంటని ప్రశ్నించిన అతనిపై హోటల్ సిబ్బంది దాడికి దిగారు. ఒళ్లు మండిన సదరు యువకుడు ఫొటోలు వీడియోలు తీసి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇంత జరిగినా మున్సిపల్ ఆరోగ్యశాఖ ఫుడ్ ఇన్స్పెక్టర్లు తనిఖీ చేసి ఎటువంటి చర్యలు తీసుకోకుండా నోటీసు మాత్రమే ఇచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో టీఎస్ 4 హోటల్ వద్ద ధర్నా చేయడంతో పిఎస్4 హోటల్‌ను సీజ్ చేయడం జరిగింది.

బొద్దింకలు, బల్లుతో కూడిన ఆహారం


తిరుపతిలో కుళ్ళిపోయిన ఆహారమే యాత్రికులకు, వినియోగదారులకు అందిస్తున్నారు. ఆహారం వేడివేడిగా ఉండటం వల్ల కుళ్ళినవాసన అందులో కనపడదు. దాని ప్రభావం తర్వాత ఆరోగ్యంపై చూపించడంతో ఫుడ్ పాయిజన్ వల్లే తమ ఆరోగ్యం దెబ్బతినేని భావించేవారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, తిరుమల బైపాస్ రోడ్డు ఎక్కువగా హోటల్స్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. గతంలో తిరుపతి రైల్వేస్టేషన్‌లో కుళ్ళిపోయిన ఆహారం తినడం వల్ల ఓ యాత్రికుడు వాంతులు విరేచనం చేసుకుని రుయా ఆసుపత్రిలో అస్వస్థకు గురైన సందర్భాలున్నాయి. గత ఏడాది ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓ హోటల్లో భోజనం చేసిన యాత్రికుడు అక్కడికక్కడే వాంతులతో ఆసుపత్రికి పాలైన సందర్భాల్లో ఉన్నాయి. ఎనిమిది నెలల క్రితం టీవీఎస్ షోరూం సమీపంలో హోటల్లో భోజనం చేసిన వినియోగదారులు దాదాపు 25 మంది అస్వస్థకు గురయ్యారు. రుయా హాస్పిటల్‌తో వారికి ఫుడ్ పాయిజన్ జరిగిందని నిర్ధారించారు. తర్వాత హోటల్ యాజమాని గుట్టుచప్పుడు కాకుండా ఎవరికి ఫిర్యాదు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నాడు.

పాడైన చట్నీ సాంబార్..

నగరంలో కొన్ని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో రెండు మూడు రోజులు నిల్వ ఉంచి నా చట్నీ సాంబార్‌ను ఫ్రిజ్లో పెట్టి ఇడ్లీ, దోశలకు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే చికెన్, మటన్, రొయ్యలు పదిరోజులు పాటు నిల్వ ఉంచి హోటల్‌కు వచ్చే యాత్రికులకు ఇవ్వడం వల్ల వాళ్ళు అనారోగ్యానికి గురవుతున్నారు. వారు ఎవరికి ఫిర్యాదుచేయాలో తెలీక చాలామంది యాత్రికులు ఫిర్యాదు చేయకుండా వారి స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. తిరుపతిలో నిత్యం ఫుడ్‌పాయిజన్ జరుగుతున్నప్పటికీ కూడా వారిపై చర్యలు నామంమాత్రం గానే ఉంటున్నాయి. కేవలం ఫైన్లు, నోటీసులకే పరిమితం అవుతున్నారు అధికారులు. పిఎస్ 4 హోటల్ సీజ్ చేయడని కూడా ఫుడ్‌ఇన్స్పెక్టర్ ఒక దశలో వెనక్కు తగ్గి తర్వాత సీజ్ చేయడం జరిగింది. అయితే ఆ హోటల్ యాజమాన్యం రాజకీయ పలుకుబడి ఉపయోగించుకొని తిరిగి హోటల్‌ను తెరిపించుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కొంతమంది హోటల్ యజమానులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా లాభార్జనే ధ్యేయంగా ఫుడ్‌పాయిజన్ కలిగిన ఆహారాన్ని ప్రజలకు అందించడం వల్ల వాళ్లు దీర్ఘకాలిక రోగాలు కూడా గురయ్యే ప్రమాదాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఫుడ్ ఇన్స్పెక్టర్ నిత్యం తనిఖీలు నిర్వహించి ప్రజలకు, యాత్రికులకు ఆరోగ్యవంతమైన ఆహారం అందించేలా చూడాల్సిన బాధ్యత వారిపై ఉంది.

రేపు కుప్పంకు సీఎం రాక

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు కుప్పంలో ఈ నెల 25, 26 తేదీల్లో పర్యటించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



పర్యటన వివరాలు ఇలా..

25న..

మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం పిఈఎస్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.55గంటలకు శాంతిపురం మండలంలోని జల్లిగానిపల్లి, 1.35గంటలకు చిన్నారిదొడ్డి వద్ద ఉన్న హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పరిశీలించి ఆర్అండ్‌బి అతిథి గృహం చేరుకుంటారు. అక్కడి నుంచి 3గంటలకు కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద బహిరంగ సభలో పాల్గొని తిరిగి ఆర్అండ్‌బి అతిథి గృహంకి చేరుకుంటారు. సాయంత్రం 4.40గంటలకు పార్టీ నేతలతో సమావేశమవుతారు. అక్కడే రాత్రి బస

26న..

బుధవారం కుప్పం ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఉదయం 10.30గంటలకు ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు కుప్పం పిఈఎస్ మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కుప్పం నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం మధ్యాహ్నం 2.40గంటలకు పిఈఎస్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో పార్టీ శ్రేణులతో సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4.10గంటలకు అక్కడే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బెంగళూరు బయలుదేరి వెళతారని కలెక్టర్ తెలిపారు.

ఏర్పాట్లలో అధికారులు



ఏర్పాట్లును పరిశీలిస్తున్న జేసీ, ఎస్పీ

సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు, ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఆదివారం వారు కుప్పం పిఎఇఎస్ మెడికల్ కళాశాలలో ఏర్పాట్లును పరిశీలించారు. హెలిప్యాడ్, జల్లిగానిపల్లి, చిన్నారి దొడ్డిలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ, తదుపరి ఆర్ అండ్‌బి అతిథి గృహం, కుప్పం బస్టాండ్ కూడలి వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం కాన్వా య్‌కి సంబంధించిన రూట్ మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, హెలి ప్యాడ్ నిర్మాణం చుట్టూ బ్యారికేడ్ల ఏర్పాట్లు, సీఎం ప్రసంగించే సభా వేదిక, ప్రజలు లోపలకి వచ్చే/పోయే మార్గాలు, వివిఐపిలు, విఐపి వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, హంద్రీ నీవా కాలువ వద్ద ఏర్పాట్లను పరిశీలిం చారు. కార్యక్రమంలో డ్వామా పిడి రాజశేఖర్, పిఆర్, ఆర్అండ్‌బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమామహేశ్వర్ రెడ్డి, అడిషనల్ ఎస్పి నాగేశ్వరరావు, ఆర్డీఓలు శ్రీనివాసులు, మనోజ్ రెడ్డి, చిన్నయ్య, వెంకటరెడ్డి, కుప్పం డీఎస్పీ శ్రీనాథ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థను సరిదిద్దాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ప్రాథమిక విద్యావ్యవస్థకు ప్రతిబంధకంగా మారిన 117 జీవోను రద్దుచేసి విద్యా వ్యవస్థను సరిదిద్దాలని యుటిఎఫ్ తిరుపతి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా సహాధ్యక్షులు కేఎస్‌బి.సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో 117జిఓ వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ చిన్నభిన్నమైందని, వెంటనే ఆ జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యావ్యవస్థను గాడిలో పెట్టాలని కోరారు. అలాగే ప్రాథమిక విద్యావ్యవస్థలో పెద్దమొత్తంలో ఉన్న ఏకోపాధ్యాయ పాఠశాలల్లో రెండవ ఉపాధ్యాయుని నియమించి ప్రాథమిక విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఉపాధ్యాయుల నియామకం పూర్తయ్యే వరకు అవసరమైన చోట విద్యా వాలంటీర్లను ఏర్పాటు చేసి పాఠశాలల్లో బోధన సక్రమంగా జరిగేటట్లు చూడాలని కోరారు. జిల్లాలో రికార్డ్ షీట్ పుస్తకాల పేరుతో కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పేరుతో జరుగుతున్న ఆర్థిక వసూళ్లపై విచారణ చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధానకార్యదర్శి ముత్యాలరెడ్డి మాట్లాడుతూ పలు మండలాల్లో విద్యాశాఖ అధికారులు నిర్బంధంగా పుస్తకాలు కొనుగోలు చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఒత్తిడి చేస్తూ ఉన్నారని మండలాలలో ఒక పుస్తకానికి రూ.420 నుండి 450లు వరకు వసూలు చేస్తున్నారని వీళ్ళు మాత్రం రూ.300లు మాత్రమే బిల్లు ఇస్తున్నారని తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షులు శేఖర్ మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్లు ఏర్పాటు చేసిన చోట అవసరమైన పోస్టులను మంజూరు చేసి అర్హత గల వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, అలాగే సంవత్సరం రోజులుగా పెండింగ్‌లో ఉన్న నెలసరి పదోన్నతులు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కోశాధికారి రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవరాల నిర్మల మాట్లాడుతూ యుటిఎఫ్ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే స్వర్ణోత్సవ మహాసభలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయడానికి ఇప్పటినుండే కార్యాచరణ మొదలుపెట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు దండు రామచంద్రయ్య, బండి మధుసూదన్ రెడ్డి, ప్రభాకర్, పద్మజ, సురేష్, మోహన్ బాబు, వెంకటకృష్ణ, విజయకుమార్, సుధీర్, హరిబాబు, గీతమ్మ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

క్యూలైన్లను పరిశీలించిన జేఈవో వీరబ్రహ్మం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. శ్రీవారి దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో మొత్తం కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి కోసం 24 గంటల సమయం పడుతున్నదని జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. దర్శన క్యూలైన్లలో ఉన్న భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను, అందుతున్న సౌకర్యాలు జేఈవో పరిశీలించారు. క్యూలైన్లలోని భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శనివారం శ్రీవారిని 74,467 మంది భక్తులు దర్శించుకున్నారు. 40,005 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. ఇక హుండీ ఆదాయం రూ.3.77కోట్లు వచ్చాయని తెలిపారు.

తిరుమలలో రాజకీయాలు మాట్లాడం: హోం మంత్రి

ప్రజాశక్తి- తిరుమల: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుమలలో తాము రాజకీయాలు మాట్లాడమని చెప్పారు. ఆదివారం ఉదయం శ్రీవారిని విఐపి దర్శన సమయంలో దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అక్రమంగా ప్రభుత్వ భూములలో నిర్మించిన వైసీపీ కార్యాలయాలను తొలగిస్తామని చెప్పారు. మహిళలకు పూర్తి భద్రత అందిస్తామని, మహిళలే ఎన్డీఏ కూటమికి భారీ సంఖ్యలో ఓట్లు వేసి అఖండ మెజార్టీని కల్పించారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఆంధ్రరాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా తీర్చిదిద్దని అనిత మండిపడ్డారు. గంజాయి నుంచి యువతను కాపాడి గంజాయిని పూర్తిగా అరికడతామని అన్నారు. అంతకు ముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరానికి వెళ్లిన వంగలపూడి అనిత వేణుగోపాలస్వామిని దర్శించుకుని గోపూజలో పాల్గొని గోవులకు గ్రాసం అందించారు. కానీ ఇక్కడ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదని.. ఆలయ సంప్రదాయాలను పాటిస్తానని తెలిపారు. శ్రీవారి దర్శనం కోసం కొండమీదకు వెళ్తూ గోపూజ చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఆమె రాష్ట్ర హోంమంత్రి హోదాలో తిరుమలకు రావడం ఇదే తొలిసారి. టీడీపీ నాయకులు కేశవులు, గోపాలకృష్ణ మంత్రికి శ్రీవారి ఆలయం వద్ద స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటాలు అందించి, శాలువాలతో సన్మానించారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు




ప్రజాశక్తి- తిరుపతి సిటీ: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ట్రేడ్ యూనియన్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం తిరుచానూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదేళ్ళుగా జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ గౌరవ అధ్యక్షులు అళహరి సుధాకర్, వ్యవస్థాపక అధ్యక్షులు తోకల అశోక్ కుమార్ ఉద్యోగుల సమస్యల పట్ల స్పదిస్తున్న తీరు అభినందనీయమని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వినూత కోట, దేవర మనోహర్, కిరణ్ రాయల్, ఆకేపాటి సుభాషి, పోటికూరి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

రెండడుగుల కోసం
యానాదుల గుడి కూల్చేవేత

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: రెండడుగుల స్థలం కోసం యానాదుల ఇష్టదైవమైన గంగమ్మ గుడిని కూల్చేసిన ఘటన శనివారం రాత్రి పట్టణంలోని కుందేటివారి వీధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి పోతే.. కుందేటివారి వీధిలో యానాదులు నివాసం ఉండేందుకు ఓ దాత స్థలాన్ని దానం చేశారు. అదే స్థలంలో యానాదులు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఈక్రమంలో తాము నివాసం ఉంటున్న కాలానీలోనే గంగమ్మ గుడిని నిర్మించుకునేందుకు యానాదులు కంకణం కట్టుకున్నారు. ఈ నేపథ్యంలో దాతల సాయంతో ఆరు అడుగుల స్థలంలో గంగమ్మ గుడి నిర్మాణం చేపట్టారు. అయితే గుడి నిర్మాణం అక్రమమనీ, అది నా స్థలమంటూ అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి అడ్డుకున్నారు. శనివారం శ్రీకాళహస్తి సర్వేయర్ వచ్చి కేవలం 2 అడుగుల స్థలం మాత్రమే ఆక్రమణలో ఉందని తేల్చి, సమస్యను కూర్చుని పరిష్కరించుకోవాలని సర్వేయర్ ఇరువురికి తెలియజేసి వెళ్లారు. అందుకు ఒప్పుకున్న ఆ వ్యక్తి శనివారం రాత్రే జేసీబీ సాయంతో 60శాతం మేర పనులు పూర్తయిన గుడిని కూల్చేశాడు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన యానాదులపై దౌర్జన్యంకు పాల్పడ్డాడు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ యానాదులు వేడుకొంటున్నారు.

కొ(త)నలేం!



- ఆకాశానంటుతున్న కూరగాయల ధరలు
- ఘాటెక్కిన ఉల్లి
- సామాన్యులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి-పూతలపట్టు: కూరగాయల ధరలు కొండెక్కాయి. 50శాతం ధరలు పెరగడంతో సామాన్యులు కొనలేని స్థితికి చేరారు. ప్రస్తుత వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు అకాల వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో ధరల పెరుగుదల అనివార్యమైంది. ప్రస్తుతం అన్ని కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. గత రెండు వారాల నుంచి పెరుగుదలలో వ్యత్యాసం కనిపిస్తోంది. ఉత్పత్తి తగ్గిపోవడంతో రవాణా నిలిచిపోవడం కొందరు కృత్రిమ కొరతను సృష్టించటం వలన కూడా కూరగాయల ధరలు పెరగడానికి కారణమయ్యాయి.

పెరిగిన ధరలు ఇలా..

ప్రస్తుతం కూరగాయలను మధ్యతరగతి కుటుంబాలు కొనలేని పరిస్థితి. వంకాయలు కేజీ రూ.90 నుంచి రూ.100 వరకు ఉంది. బీరా రూ.80, బెండ రూ.60, చిక్కుళ్ళు రూ.80, దొండ రూ.80, కాకర రూ.90, టమోటా రూ.50 అనప రూ.80, క్యాబేజీ రూ.80, బంగాళదుంప రూ.80, బీన్స్ రూ.100 ఇలా ముట్టుకుంటే షాక్ కొడుతోంది. ఈ ధరలను చూసి సామాన్య, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమంటున్నారు. డిమాండ్ పెరగడం మార్కెట్లకు సరుకు అంతంత మాత్రమేనే ఉందని.. వ్యాపారులు చెబుతున్నారు. వీటి ప్రభావంతో వ్యాపారాలు అంతంతమాత్రంగానే నడుస్తున్నాయని వాపోతున్నారు. కొత్త పంట మార్కెట్‌కు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుగా వచ్చునని చెబుతున్నారు.

ఘాటెక్కిన ఉల్లి

శాఖాహారమైన మాంసాహారమైన ప్రతి ఇంట్లో ఉల్లి తప్పనిసరిగా ఉండాల్సిందే. ఇలాంటి ఉల్లికి డిమాండ్ బాగా పెరిగింది. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి ఉల్లిపాయలు వస్తున్నాయి. ఇక్కడ రబీలో వేసి ఉల్లి పంటలు అకాల వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో 50శాతం వరకు దిగుబడులు తగ్గిపోవడంతో ధరలు ఘనంగా పెరుగుతున్నాయి. రెండు వారాల కిందట వరకు కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య ఉండగా ఒక్కసారిగా రూ.50 చేరుకుంది గ్రేడింగును బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. రెండో రకం ఉల్లి రూ.35 ఉండగా మొదటి రకం ధర రూ.50 వరకు ఉంది. మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారాలు చెబుతున్నారు.

మరింత పెరిగే అవకాశం..

రైతు బజారు నుంచి గల్లి దుకాణాల వరకు కూరగాయల ధరలు కాక పుట్టిస్తున్నాయి. దాదాపు అన్ని రకాల ధరలు మండిపోతున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు నష్టాలను సరిచూడాల్సివచ్చింది. పంట దెబ్బతినడంతో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ఏ కూరగాయల రేటు చూసిన రూ.80 పైగానే ఉంది. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కూరగాయలు లేకుండా పూట గడవని పరిస్థితిలో వాటి ధరలు ఆకాశాన్ని అంటడంతో కిలో కొనాలన్నా వారు అర కిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

అందని పౌష్టికాహారం..

ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ చార్జీలు సరిపోని పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందడం లేదు. మరోవైపు కూరగాయల ధరలు రెట్టింపు కావడంతో సంక్షేమ విద్యార్థులు మరిన్ని ఇబ్బందులకు గురవుతున్నారు. మెనూ చార్జీలను పెంచకపోవడం.. మరోవైపు పెరిగిన కూరగాయల ధరలతో కొందరు వార్డెన్లు సతమతమవుతున్నారు. కొన్నిచోట్ల చేసేదేమీ లేక కూరగాయల్లో నాణ్యత తగ్గిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సాయితేజకు ఆలిండియా ర్యాంకు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని పుత్తేరి గ్రామ పంచాయతీకి చెందిన గరుడ ధాత్రి మండల విలేకరి, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యుడు పెరిమిడి రఘు కుమారుడు సాయితేజ ఇటీవల నిర్వహించిన శ్రేష్ఠ పరీక్షల్లో ఆల్ ఇండియా ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఆల్ ఇండియా ర్యాంక్ 1583 ర్యాంకు సాధించిన సాయి తేజను మరెన్నో ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఏపీడబ్ల్యూజెఎఫ్ సత్యవేడు నియోజక వర్గ అధ్యక్షుడు వేణు, ప్రెస్‌క్లబ్ సభ్యులు అభినందించారు.

వైభవంగా ఎస్ఓఎస్ దినోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్ తిరుపతి నాగంపల్లి వద్ద ఎస్ఓఎస్ చిల్డ్రన్ విలేజ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెర్మన్ మైనర్ జయంతిని పురస్కరించుకొని 60వ ఎస్ఓఎస్ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ అరవింద్‌కుమార్, డైరెక్టర్, వైస్ ఛాన్సలర్, ఎస్ వై ఎస్ సి ఓ సుమత్ర్ పాల్గొన్నారు.

'తిరుమల స్థానికులను ఆదుకుంటాం'

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలోని బాలాజీనగర్, చంద్రబాబుతోట ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు ఆరణి మదన్ పర్యటించారు. ఆదివారం ఉదయం బాలాజీనగర్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలతో మదన్ భేటీ అయ్యారు. అనంతరం బాలాజీనగర్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రేకుల స్థానంలో స్లాబ్ వేయాలని స్థానికులు మదన్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సమస్యతో పాటు డ్రైనేజీ సమస్య చాలా ఇబ్బందిగా ఉన్నట్లు మదన్‌కు స్థానికులు తెలిపారు. అనంతరం చంద్రబాబుతోటలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. త్వరలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల ఉపాధ్యక్షులు పగడాల మురళి, రమణ, శివ, సుధాకర్, మంజు, దినేష్, తనూజ్, కుమార్, పాండు పాల్గొన్నారు.



మహిళా, యోగి వేమన వర్సిటీల అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంకు, యోగి వేమన యూనివర్సిటీ కడపతో అవగాహన ఒప్పందం జరిగింది. ఈఅవగాహన ఒప్పందం పైన ఇరువర్సిటీల రిజిస్ట్రార్లు ఆచార్య ఎన్.రజిని, ఆచార్య వైపి.వెంకట సుబ్బయ్య మహిళా వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.భారతి సమక్షంలో అవగాహన ఒప్పందంపైన సంతకాలు చేశారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా యోగివేమన యూనివర్సిటీ నుండి ఐటీ సర్వీసెస్ సహకారం పొందనున్నారని ఉపకులపతి ఆచార్య డి.భారతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల మధ్య అకాడమిక్ అంశాలు, పరిశోధన ప్రాజెక్టులు వంటి అంశాలలో పరస్పర సహకారంతో వర్సిటీల అభివృద్ధికి సాధ్యమవుతుందని అన్నారు. తద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో వినూత్న పరిశోధనలు బయటికి తీసుకురావడానికి అవకాశం ఉంటుందన్నారు.




ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా..

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- తిరుపతిసిటీ, తిరుపతి టౌన్ : ఆర్యవైశ్యులకు అండగా వుంటానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి ఆయన సతీమణి సత్యవతిలను ఆర్యవైశ్య సంఘం నగర కమిటీ ఆదివారం సత్కరించింది. రెండేళ్ల కాలంలో సంఘం నిర్వహించిన సేవాకార్యక్రమాలను అధ్యక్షులు నరసింహులు వివరించారు. జనసేన గెలుపు ఆర్యవైశ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించి గెలుపులో తమవంతు కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనం ప్రతినెలా రెండవ మంగళవారం స్థానికులకు కల్పించాలని కోరారు. ఎన్నికల్లో జనసేన గెలుపుకు కృషి చేసిన వారితో పాటు ఐదుగురిని సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యలకు తమకు మధ్య కుటుంబ బంధం ఉందని చెప్పారు. కష్టపడి వ్యాపారం చేయడమే కాక సంపాదించిన సొమ్ములో కొంత దానం చేయగల గుణం ఒక్క ఆర్యవైశ్యులకే చెల్లిందని కొనియాడారు. ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవులతోపాటు ప్రత్యక్ష ఎన్నికల్లోనూ సీట్లు ఇవ్వడమే కాకా గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. సంఘం తిరుపతి నగర కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమ చంద్రకుమార్, రాష్ట్ర ఆర్యవైశ్య యువజన విభాగం అధ్యక్షులు వికాష్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ద్వారక, జనసేన నాయకులు వూసా మాధవరావు, వంశీ, నవీన్ పాల్గొన్నారు.

గుడిమల్లం ఆలయంలో ఎక్సైజ్ సీఐ



గుడిమల్లం ఆలయాన్ని సందర్శించిన ఎక్సైజు సీఐ

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఎర్రగుంట్ల ఎక్సైజ్ సీఐ లీలా కుమారి ఆదివారం ఏర్పేడు మండలం గుడిమల్లం పరమేశ్వర స్వామీ దేవాలయానికి విచ్చేసి, స్వామి, అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. పాపానాయుడు పేట టీడీపీ నేత మేకల తూరు రవి కుమార్, శివ వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పవన్ సాయి, లలితమ్మ శాలువా కప్పి తీర్థ ప్రసాదాలు అందించారు.

గ్రామీణ వైవిధ్య కథలు మడకెద్దులు..

- సమాజాన్ని ప్రతిబింబించే పాత్రల సృష్టి
- ఆవిష్కరణ సభలో పలువురు వక్తల ప్రశంస

ప్రజాశక్తి - క్యాంపస్ : 'మడకెద్దులు ' సంపుటి లోని కథలు పేరూరు బాలసుబ్రహ్మణ్యం సామాజిక స్పృహతో వాస్తవ సంఘటనలను ఆధారంగా రాసినవని, ఎంతో మదనపడితే తప్ప ఇలాంటి కథా రచన సాగదని ఆవిష్కర్త భూమన్ అన్నారు. ఆదివారం తిరుపతి నగరంలోని శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయం గ్రంథాలయం సమావేశ మంది రంలో తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో ఆకుల మల్లేశ్వరరావు అధ్యక్షతన ప్రముఖ కథా రచయిత పేరూరు బాలసుబ్రహ్మణ్యం రాసిన కథలు మడకెద్దులు పుస్తకావిష్కరణ సభ నిర్వ హించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర మాట్లాడుతూ మడకెద్దులు లేని కాలంలో ఈ కథలు వస్తున్నాయి. రైతులను పట్టించుకోని సమయంలో రైతు కథలు వచ్చాయి. వస్తువు కోసం వెతుకులాట కాకుండా తన లోకానుభవాలను, యథార్థ సంఘటలను రచయిత కథల్లో చిత్రించారని, తాను ఏది రాయాలో అదే తన కథల్లో ఆవిష్కరించారన్నారు. మడకెద్దులు పుస్తకాన్ని సమీక్ష చేసిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



జిల్లేళ్ల బాలాజీ మాట్లాడుతూ మడకెద్దులు కథలో తల్లి పడే ప్రసవ వేదన, శిశిర స్వప్నంలో బిడ్డల పట్ల తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేశారని అన్నారు. స్వప్నంలా కాకుండా వాస్తవాలను వెలుగులోకి తెచ్చి కోడిగుడ్డు పోరుటు కథలో ఇద్దరు వ్యక్తుల మధ్య పోటీతత్వం గురించి బాల్యదశలో తన స్వీయా నుభావాల్ని కథాత్మకంగా చెప్పారన్నారు. గాలెమ్మ వంటి కథలు సామాజిక సంఘర్షణలకు దర్పణం అని అన్నారు.తెలుగు భాషోద్యమ సమితి గౌరవాధ్యక్షు రాలు గంగవరం శ్రీదేవి మాట్లాడుతూ నాగలి ప్రాధాన్యతను గుర్తించి, రైతులు స్థితి గతులను మడకెద్దులు పేరుతో పేరూరు బాలసుబ్రమణ్యం కథా సంపుటిగా తేవడం రైతు బిడ్డగా అభినంద నీయుడన్నారు. తెలుగు భాషోద్యమ సమితి వ్యవ స్థాపకులు సాకం నాగరాజ మాట్లాడుతూపేరూరు బాలసుబ్రహ్మ ణ్యం జీవితమే ఒక పోరాట కథ అంటూ బాల్యదశ నుండి నేటి వరకు ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని మంచి కథా రచయితగా పేరు పొందడం ప్రశంసనీయం అన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడుతూ పేరూరు బాలసుబ్రమణ్యం వ్యక్తిత్వమే తన కథలసారమని కొనియాడారు. విశ్వనాథ రెడ్డి, వాకా ప్రసాద్, తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం పుస్తకాలతో సావాసం చేస్తూ సాటి మనుషుల మధ్య జరిగిన సంఘటనలను కథా వస్తువులుగా అందరికీ అర్థమయ్యే రీతిలో రాయడం అభినందనీ య మన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి, తెలుగు భాషోద్యమ సమితి సభ్యులు టెంకాయల దామోదరం, దామోదర గుప్త, పొక్కళ్ళ సుభద్ర, శశిధర్ రాజు,నాదెండ్ల శ్రీమన్నారాయణ, తెలుగు ఆచార్యులు పి సి వెంకటేశ్వర్లు,యువశ్రీ, సుహాసిని, కాంతారావు, కొత్వాలు అమరేంద్ర, షణ్ముగం, గొడుగుచింత గోవిందయ్య, ఏడు కొండలు, గోవిందయ్య, జయపాల్, జయరాం ప్రసాద్, కేశవులు , రాజ, ఆంజనేయులు, కన్నెప్ప హరి పాల్గొన్నారు.

సమర్థ నిర్వహణకు కృషి చేసిన పోలీసులకు అభినందనలు

ఆత్మీయ సభలో ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేసిన పోలీసులకు అభినందనలు తెలుపుతున్నామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. తన పల్లి క్రాస్ సిఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం చంద్రగిరి సబ్ డివిజన్ లోని పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా భారత ఎన్నికల సంఘం ప్రకటించిందని, పోలింగ్ ప్రశాంతంగా జరిగినా, పోలింగ్ అనంతరం చంద్రగిరి నియోజకవర్గంలో పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరగడంతో శాంతి భద్రతల పరిరక్షణ పెద్ద సవాలుగా మారిందన్నారు. అయినా చంద్రగిరి సబ్ డివిజన్ పోలీసులు ఆత్మస్థైర్యంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని కౌంటింగ్ రోజున, కౌంటింగ్ అనంతరం ఎలాంటి ఘటనలు జరగకుండా బాగా కష్టపడి పని పనిచేశారని ప్రశంసించారు. పోలీసులు అందరూ ఆత్మ విమర్శ చేసుకుని, స్వీయ క్రమశిక్షణ కలిగి రానున్న రోజులలో చట్టానికి లోబడి పనిచేసి, చంద్రగిరి సబ్ డివిజన్ పై అపవాదును పూర్తిగా చెరిపివేయాలని పిలుపు నిచ్చారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కష్టపడి పని చేసే సిబ్బందికి గుర్తింపుగా ప్రోత్సాహక రివార్డుల నిమిత్తం పేర్లు పంపాలని ఎస్ హెచ్‌ఓలను ఆదేశించారు. పోలీసులకు రివార్డులు అందించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం ఎస్పి అదనపు ఎస్పిలతో కలిసి పోలీస్ సిబ్బందికి స్వయంగా మధ్యాహ్నం భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరావు (పరిపాలన), శ్రీనివాస రావు (సాయుధ దళం), డీఎస్పీలు వెంకటాద్రి (ఎస్‌బి), నరసింగప్ప చంద్రగిరి, రవీంద్రారెడ్డి (ఏఆర్), చంద్రగిరి సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆత్మీయ సభలో మాట్లాడుతున్న ఎస్‌పీ హర్షవర్ధన్ రాజు

షార్ట్ సర్క్యూట్ తో ద్విచక్ర వాహనం దగ్ధం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధిలో షార్ట్ సర్క్యూట్‌తో మోటారు వెహికల్ దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. గూడూరు అగ్నిమాపక అధికారి చలమయ్య కథనం మేరకు గూడూరు పట్టణంలోని కుమ్మరి వీధి కి చెందిన కిషోర్ అనే వ్యక్తికి చెందిన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్ అని తెలిపారు. పనుల నిమిత్తం ఇంటి నుండి బైక్ ను బయటకు తీసుకు వస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయన్నారు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటా హుటిన సంఘటన స్థలానికి వెళ్లి ఫైర్ ఇంజిన్ ద్వారా మంటలను అదుపుచేయడం జరిగిందన్నారు. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

సరస్వతి సేవా సమాజం సేవలు ప్రశంసనీయం: డిఇవో

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : సరస్వతి సేవా సమాజం సేవలు ఎంతో స్ఫూర్తి దాయకమని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి శేఖర్ ప్రశంసించారు. సరస్వతి సేవా సమాజం 20వ సర్వసభ్య సమావేశం పట్టణంలో ప్రభుత్వ స్కూలులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఇవో శేఖర్ మాట్లాడుతూ సరస్వతి సేవా సమాజం స్థాపించి నప్పటి నుండి ఎన్ని పనులు ఉన్నా అన్నీ కార్యక్రమాలకు హాజరై సేవ చేస్తున్నారని మూలస్తంభమైన ప్రసాద్‌ని అభినందించారు. మరో అతిథి పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్ రాజు మాట్లాడుతూ సరస్వతి సేవా సమాజం విద్యార్థులకు బోధనా సామగ్రితో పాటు 10వ తరగతి లో ప్రథమ, ద్వితీయ శ్రేణుల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి నగదు బహుమతి, మెమెంటోలు ఇచ్చి ప్రోత్సహించడం, పేద అనాథ విద్యార్థిని ఇంటర్మీడియట్ చదివించడానికి దత్తత తీసుకోవడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న సంఘం సభ్యులు అభినందనీయులన్నారు. సమాజ సేవా కార్యక్రమాలను సంఘం సభ్యులు రవిశంకర్, బాలసుబ్రహ్మణ్యం వివరించారు. ఈ సమావేశంలో రామ కృష్ణమరాజు అధ్యక్షత వహించారు. మండల విద్యా శాఖాధికారులు తిరుమల రాజు, బాలసుబ్రహ్మణ్యం ప్రత్యేక అతిథిలుగా హాజరయ్యారు. ఈ సమావేశానికి యుగంధర్ రాజు, కుమారవేలు, పురుషోత్తం, వినోద్ బాబు, అమరనాథ్, రామ మోహన్, మురళీ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరాజు, సుబ్రహ్మణ్యం ఆచారి, పురుషోత్తం శెట్టి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



ఉత్తమ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న విద్యాధికారులు

అధికారంతో తొలి అడుగు...

- చంద్రగిరి అభివృద్ధికి మలి దశ మలుపు
- నాపై చూపిన ఆదరణ, అభిమానాలకు కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం: ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి అధికారంతో తొలి అడుగు వేసిన పులివర్తి నానికి రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కూటమి శ్రేణులు భారీగా తరలి వచ్చారు. అడుగడుగునా గజ మాలలతో సత్కరించి స్వాగతం పలికారు. యువకులు బాణాసంచా మోతతో హోరెత్తించారు. గతంలో లేని రీతిలో పులివర్తి నానికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో పులివర్తి నాని ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం సాయంత్రం తిరిగి రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్నారు. ఆయన రాకతో చంద్రగిరి అభివృద్ధి మలి దశ మలుపు తిరుగనుంది. పులివర్తి నానికి భారీ గజమాలలతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఆహ్వానం పలికారు. భారీ ర్యాలీగా బయలుదేరి రఘునాథ్ రిసార్ట్స్ లోని ఇంటి వద్దకు ఆయన చేరుకున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో భారీ మెజారిటీతో గెలిపించారు. ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని పులివర్తి నాని తెలిపారు. ఎమ్మెల్యే పులిగోర్తినానికి ఘన స్వాగతం పలికిన వారిలో ఆరి.లీలా మోహన్ నాయుడు, కే రామిరెడ్డి, బాబు యాదవ్, ధనుంజయ రెడ్డి, ఎస్ గౌస్ బాషా, బిరుదాల భాస్కర్ రెడ్డి, శ్రీధర్ నాయుడు, బండి విజయ్ కుమార్ రెడ్డి, పాకాల జెడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, బాబు రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌లపై చర్యలు తీసుకోవాలి

హోం మంత్రికి టిఎన్‌ఎస్‌ఎఫ్ వినతి

ప్రజాశక్తి - క్యాంపస్ : నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనితనికి టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక కొత్త బెట్టింగ్, సెబి అనుమతి లేని బైనరీ ట్రేడింగ్, మల్టీ లెవెల్ మార్కెటింగ్ యాప్స్ యువతను, నిరుద్యోగులను సులభ మార్గంలో డబ్బులు సంపాదించుకోవచ్చని మభ్యపెట్టి వారి దగ్గర నుండి వేల నుండి లక్షలాది రూపాయల పెట్టుబడి రూపంలో డిపాజిట్లు చేయించుకుని పెద్ద మొత్తంలో ఇలాంటి పెట్టుబడులు మొత్తం పోగేసుకున్న తర్వాత ఈ యాప్ లన్నీ కూడా ఆఫ్‌లైన్‌లోకి వెళ్లిపోతున్నాయన్నారు. ఇలాంటి బోగస్ అప్లికేషన్లు, వెబ్‌సైట్‌ల నిర్వాహకులు, ప్రమోట్ చేస్తున్న ఇన్ఫ్లుయెన్సర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీస్ శాఖలో ఇలాంటి అప్లికేషన్లు, నకిలీ వెబ్‌సైట్లను మన రాష్ట్రంలో నియంత్రించడానికి నూతన శాఖను ఏర్పాటు చేసే అంశంపై పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.



హోం మంత్రికి వినతిపత్రం అందిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

డ్రైనేజీలపై దుకాణాలు నిర్మించొద్దు..

ఆక్రమణల తొలగింపులో కమిషనర్ హెచ్చరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో డ్రైనేజీలపై ఎలాంటి దుకాణాలు నిర్మించ వద్దని అలా నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎం రెడ్డి హెచ్చరించారు. స్థానిక కార్వేటినగరం రోడ్డులోని పలువ చోట్ల డ్రైయినేజీలపై నిర్మించిన భవన నిర్మాణాలను, ట్రాఫిక్‌కు అడ్డంగా వున్న దుకాణాలను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక కార్వేటినగరం రోడ్డులో మురుగునీరు, వర్షపు నీరు వెళ్లేందుకు ఎలాంటి పారుదల లేక అక్కడే నీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని పురపాలక సంఘం గుర్తించిందన్నారు. సభలో తీర్మానం మేరకు ఈ సమస్య పరిష్కారానికి రూ. 8 లక్షలు మంజూరు చేశామని, ఈ కాలువ పనులు వేగవంతంగా చేపట్టి పూర్తి చేశారన్నారు. ఈ నేపథ్యంలో కాలువపై ఆక్రమంగా భవన నిర్మాణాలు నిర్మించ వద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు. అక్రమంగా నిర్మించిన దుకాణాలను తొలగిం చారు. ఆటో డ్రైవర్లు రోడ్డు పై ట్రాఫిక్ కు అంతరా యం కలిగిం చే విధంగా ఆటో స్టాండ్ ను ఏర్పాటు చేయ కూడదని తెలిపారు. పట్టణ జనాభా రోజు రోజుకూ పెరిగిపోవడం వల్ల ట్రాఫిక్ సమస్య అధికమవు తోందన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా పుత్తూరు డిఎస్‌పి సహకరంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో. మున్సిపల్ సిబ్బందులు పోలీస్ శాఖ పాల్గొన్నారు.



ఆటోల యజమానులతో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

క్రైం న్యూస్

ముగ్గురు స్మగ్లర్లు అరెస్ట్

ఎర్రచందనం సహా వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి నాలుగు ఎర్రచందనం దుంగలతో పాటు కారు, మోటారు సైకిల్‌ను టాస్క్ ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఎస్‌పి పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ ఐ సురేష్ బాబు బృందం శనివారం రాత్రి నుంచి అన్నమయ్య జిల్లా సానిపాయ పరిధిలో కూంబింగ్ చేపట్టారని అధికారులు తెలిపారు. ముదుంపాడు అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తూ కనిపించారని వారిని చుట్టుముట్టేందుకు యత్నించగా పారిపోవడానికి యత్నించారన్నారు. చాకచక్యంగా వారిలో ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నా మన్నారు. పట్టుబడ్డ స్మగ్లర్లు తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లాకు చెందిన విజయకుమార్ , మోహనవేల్ , శక్తివేల్ లుగా గుర్తించామన్నారు. ఆదివారం తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించి కేసు దర్యాప్తు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నామని, ఈ కేసును టాస్క్ ఫోర్స్ సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

భర్తపై కాల్చిన నూనెను పోసిన భార్య

పోలీసులకు బంధువుల ఫిర్యాదు

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భర్తపై భార్య కాల్చిన నూనెను పోసిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధితుడి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలం అబాక పంచాయతీలోని అమ్మలపాడు గ్రామంలో కారిమేటి ఉదయ్ కుమార్‌పై అతని భార్య కారిమేటి మస్తానమ్మ సలసల కాగుతున్న వంట నూనెను పోసింది. భార్య భర్తల గొడవల కారణంగా భర్తపై కోపంతో నూనె పోసిందని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయకుమార్‌ను సూళ్లూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రహీం రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చంద్రగిరి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..చంద్రగిరి మండలం, కందులవారిపల్లి గ్రామ సమీపంలోని భీమానది కట్టపై సుమారు 25-30 సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుని కుడి చేతికి ధనమ్మ అని పచ్చబొట్టు తెలుగులో ఉంది. ఆనవాళ్లు గుర్తుపడితే చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని చంద్రగిరి సీఐ రామయ్య పేర్కొన్నారు. సి.ఐ. రామయ్య సెల్ నం.94407 96760 కు గాని, పోలీస్ స్టేషన్ ల్యాండ్ లైన్ నెంబర్ 08772289020 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. మృతుడు బ్లూ కలర్ చెక్ లు కలిగిన షర్టు, సిమెంట్ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి గడ్డం వెంట్రుకలు కలిగి ఉన్నాడు. ఇదిలా ఉండగా ఆ యువకుడు ఎవరు ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చాడు? ఎలా వచ్చాడు? ఎవరైనా చంపి పడేశారా? ఇతర కారణాలు ఏమై ఉంటాయో ? పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1120 గ్రాముల గంజాయి తో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ సిఐ జయ నాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెస్ట్ పోలీసులకు అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీలు చేపట్టమన్నారు. మున్సిపల్ కార్యా లయం ఎదుట చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం కు చెందిన బుక్కే చంద్రశేఖర్ నాయక్, అన్నమయ్య జిల్లా మదనపల్లె బసినికొండకు చెందిన పఠాన్ జై బున్నిసాలు అక్రమంగా గంజాయి తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారన్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని వెల్లడించారు.

మద్యం మత్తులో యువకుడికి కత్తిపోట్లు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: మద్యం మత్తులో గొడవపడి ఓ యువకుడు కత్తిపోటులకు గురైన సంఘటన ఆదివారం నగరంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్న ఫక్రుద్దీన్ బాబా (30) స్నేహితుడు గోరతలంతో కలిసి ఆదివారం మద్యం సేవించారు. డివిఆర్ హాస్పిటల్ రోడ్డు కళ్యాణమండపం వద్ద మద్యం మత్తులో గొడవపడి గోరతలం (28) మరో ఇద్దరితో కలిసి కత్తితో దాడి చేశాడు. బాధితులు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్ళు అక్కడికి చేరుకునేసరికి నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితుని చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు ఈస్ట్ పోలీసులు పేర్కొన్నారు.

బడి ఈడు పిల్లలను బడికి పంపాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: బడి బయట వున్న బడి ఈడు పిల్లలను బడికి పంపాలని ఎంఈవోలు బి తిరుమల రాజు, ఎం బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమం కేబీఆర్ పురంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న అన్ని హేబిటేషన్‌లలో క్యాంపెయిన్ నిర్వహించి వంద శాతం నమోదు చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి పాఠశాలలో నమోదు కాని విద్యార్థులను గుర్తించి, స్టూడెంట్స్ డ్రాప్ అవుట్ రేటు తగ్గించడం, విద్య పట్ల అవగాహన, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేబీఆర్ పురం పరిధిలోని గ్రామాలలో పర్యటించి విద్యార్థులందరూ పాఠశాలల్లోనే ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, కేబీఆర్‌పురం ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యాయులు, సి ఆర్‌ఎంటీఎస్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం లోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలో భాగంగా స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ ఏర్పాటు చేసి హోమం నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో భక్తుల గోవింద నామ స్మరణతో పట్టణ పురవీధుల్లో రథోత్సవం ఘనంగా సాగింది. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దినకరన్‌కు ఎమ్మెల్యే నివాళి



దినకరణ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: గుండె పోటుతో మృతి చెందిన టిడిపి సీనియర్ నేత దినకరన్ భౌతిక కాయా నికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం నివాళి అర్పిం చారు. నాగలాపురం మండ లం వెళ్లూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నేత ఏ దినకరన్ కు శనివారం రాత్రి ఇంటి వద్ద గుండె పోటు వచ్చింది.చికిత్స నిమిత్తం బంధువులు వెంటనే చెన్నై లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దినకరన్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం ఉదయం నాగలాపురం మండలం వెల్లూరు గ్రామానికి చేరుకొని దినకరన్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.